కథా నిలయం
4665

# పెళ్ళాం మొగుడు

"ఓం మారీచాయ నమః. ఓం దుష్ట రామబాణ నిధనాయనమః, ఓం తాటకీ పుత్రాయ నమః, ఓం సుబాహు భ్రాతాయ నమః, ఓం రామాయణ కథానాయకాయ నమః.." అంటూ అష్టోత్తరం చదివి కొబ్బరికాయ కొట్టాడు మారయ్య. ఆపైన చెంపలు ఫెటఫెటా వాయించు కుని, సాష్టాంగ దండప్రణామం చేశాడు మారీచ మహాసుర చిత్ర ప్రతిమకు మహాభక్తిగా. ఆ తర్వాత ఓ పిల్లి కూత కూశాడు. కుక్కలా భౌభౌ మన్నాడు. గార్దభంలా ఓండ్ర పెట్టాడు.

అంతలో కాని కాలంలో ఓ కోయిల "కుహూ, కుహూ" అని కూసింది. మారయ్య వెనక్కి తిరిగి "రా, రా" అంటూ పిల్చాడు. ఆ వచ్చింది ఇల్లుగలాయన కూతురు మంగ తాయారు. కోయిల గొంతును అనుకరిస్తూ, మిమిక్రీ కళాకారుడైన మారయ్య గుండెల్లో గూడు కట్టుకుందా పిల్ల.

ఆమె దృష్టి ఎప్పటి నుండో మారయ్యపై వాలింది. ఆమె తండ్రి కుక్కుటేశ్వరరావుకు ఏడుగురు కూతుళ్ళు. ఐదుగురికి కట్నాలిచ్చి పెళ్ళిళ్ళు చేసి చతికిలబడి పోయాడాయన. తనకు పెళ్ళి చేసే పరిస్థితిలో తండ్రి లేడని ఆమెకు తెల్సు. అందుకే మారయ్యను ఎంచు కుందామె. మారయ్య చక్కటి గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నాడు. ఒక్క మిమిక్రీ విషయంలో తప్ప మారయ్యలో మూర్ఖత్వం మచ్చుకైనా కన్పించదు. మిమిక్రీ అతనికో అబ్సెషనై పోయింది. అదీ అతని గురువు గురువయ్య అంటించిన జాడ్యం. అతన్ని ఆక ర్షించి తన దోవకు తెచ్చుకుంటే అతని గురువుకు విడాకులిప్పించటం చిటికెలో పని. మనిషి బలహీనత నాధారంగా మనిషిని సాధించటం తేలిక అని ఆమె ఎప్పుడో తెల్సు కుంది. అందుకే కోయిలగొంతు ననుకరించింది ఆమె. మిగతా వాటిని అనుకరించటం ఆమె వల్లకాని పని. కోయిలగొంతు ఆమె రాకకో సంకేతమైంది. ఆ స్వరం వినంగానే మారయ్య గుండె కోతిలా కుప్పిగంతులేస్తుంది.

"మారూగారూ! సాయంత్రం సినిమా ప్రోగ్రాం మర్చిపోలేదుగా మీరు?" అని అడిగింది.

"నేనా మర్చిపోయేది? కులగిరులు కుంగనీ, సప్తసముద్రాలు ఇంకిపోనీగాక, ఈ మారయ్య మాత్రం ఇచ్చిన మాట తప్పడుగాక తప్పడు" అన్నాడు మారయ్య పౌరాణికాల్లోని పాత్రననుకరిస్తూ.

"అబ్బ! ఎంత చక్కగా మాట్లాడతారు! మీతో మాట్లాడుతుంటే ఇంక పౌరాణిక నాటకాలు చూడాలనిపించదు" అందామె ప్రశంసా పూర్వకంగా, అతని వంక చూస్తూ.

'మరేంటనుకున్నావ్. మన ప్రతిభ అంటే' అన్నట్లు గర్వంగా ఆమె వంక చూశాడు మారయ్య.

"సరే వస్తా. సాయంత్రం మర్చిపోకండి" అంటూ ఆమె వెళ్ళిపోయింది.

మారయ్య అనుష్ఠానం పూర్తికాలేదు. రకరకాల జంతువుల అరుపులతోపాటు, రైలింజను, విమానం లాంటి యంత్రాలను అనుకరిస్తూ ప్రాక్టీసు చేస్తున్న తరుణంలో, చేతిలో ఫ్లాస్కుతో గదిలో కడుగుపెట్టాడు మారయ్య మిత్రుడు వినాయకరావు.

"ఒరేయ్, మారయ్యా, ఇలా ప్రాణం తోడకురా రోజూ. ఈ పిల్లి కూతలూ, కుక్కలు, గాడిదల అరుపులు వినలేక ఛస్తున్నాను" అన్నాడు వినాయకరావు కాఫీ ఫ్లాస్కు టేబుల్ మీదపెడ్తూ.

"పోతే పోనీ ప్రాణం. ఇలా రోజూ పుటుక్కు పుటుక్కుమని చావటం కంటే ఒకే రోజు పోతేపోలా. వెధవ ప్రాణం, వెధవ ప్రాణమని. నా కళా వ్యాసంగానికి అడ్డొచ్చావంటే నిజంగానే నీ ప్రాణం తీస్తాను" అన్నాడు మారయ్య.

వీధి వైపు తలుపు నుండి లోపలికి తొంగి చూసింది ఓ గాడిద. ప్రహరీ లోపలనున్న తలుపు నుండి లోపలకు ప్రవేశించాడు కుక్కుటేశ్వరరావు.

"ఏమయ్యా రోజూ ఈ ఆగడం. కుక్కల్నీ, గాడిదల్నీ, పిల్లుల్నీ పెంచుతున్నారా? మీకు గది అద్దెకిచ్చే రోజే చెప్పాను. ఇలా అడ్డమైన జంతువుల్నీ పెంచే వాళ్ళంటే నాకిష్టం లేదని. ఏమిటయ్యా అది? ఆ గాడిద మీదేనా?" అన్నాడు కుక్కుటేశ్వరరావు కోపంగా లోపలకు తొంగి చూస్తున్న గాడిదను పరికిస్తూ.

"ఛఛ. మాదెందుకవుతుందండీ. ముద్దుగా కుక్కల్నీ, పిల్లుల్నీ అయితే పెంచుకోవచ్చు గాని గాడిదల్ని పెంచుతారా ఎవరైనా?" అన్నాడు వినాయకం.

"ఒరే, అలా అనకురా. అపచారం మాటలు. గాడిదల్ని పెంచుకుంటే మాత్రమేం తప్పు? ఎంత ముద్దుగా ఉంటాయవి! గణపతి లాంటి మహానుభావుడు గార్దభ రాజాన్ని విష్ణువుతో పోల్చాడు" అని గార్దభం వంక తిరిగి, "రావే నా వరహాల కూనా, నా బంగారుగనీ, నా వజ్రాల మూటా" అంటూ గార్దభంలా ఓండ్రపెట్టసాగాడు మారయ్య.

దాంతో గాడిద లోపలకు ప్రవేశించింది.

"ఓరి గాడిదా! అయితే రోజూ నువ్వే కూస్తున్నావన్న మాట ఈ కూతలన్నీ" అన్నాడు కుక్కుటేశ్వరరావు.

ఆయన మాటలు పట్టించుకోలేదు మారయ్య. "రావే కన్నిముండా, బుజ్జిముండా, రా కూర్చో" అని లోపలకు ఆహ్వానించి కుర్చీ చూపించాడు.

అది అతనివంక సందేహంగా ఓసారి చూసి తోకాడించింది.

"ఎందుకు సిగ్గుపడుతున్నావ్? ఇక్కడ పరాయి వాళ్ళెవరూ లేరు. అంతా మనవాళ్ళే" అని సిగ్గుపడుతున్న గాడిదను పట్టుకుని కుర్చీలో కూర్చుండబెట్టబోయాడు మారయ్య. పాపం, అతని మర్యాదని ఏ రకంగా అర్థం చేసుకుందో కానీ, వెనక్కాళ్ళతో అతన్నొక్క తన్ను తన్ని వీధిలోకి సగర్వంగా నడుచుకుంటూ వెళ్ళిపోయింది గార్దభరాజం.

మారయ్య, "కుయ్యో మొర్రో" అన్నాడు.

"మా బాగా అయింది. వెధవ! కుంక! గాడిదలకు మర్యాద చేస్తావా? అంతా మన వాళ్ళే, పరాయి వాళ్ళెవరూ లేరంటావా దాంతో. మమ్మల్ని గాడిదలతో సమానం చేస్తావా? మా బాగా అయింది శాస్తి" అన్నాడు సంతోషపడ్తూ కుక్కుటేశ్వరరావు.

"గార్దభాలకంటే మీ గొప్పేంటండీ? గాడిదలు బరువులు మోస్తాయి. మీరు గాడిదలా బోల్డంత సంసార భారాన్ని మోస్తున్నారు."

"గాడిద వెధవా! నన్నా వీధి గాడిదలతో పోల్చావంటే పళ్ళు రాలగొడ్తాను."

"పోన్లేండి ఇంటి గాడిదే అంటాను."

"అదుగో మళ్ళీ..."

కోపం వచ్చింది మారయ్యకు. "ఇదుగో ముందే చెప్తున్నాను. గుర్తుంచుకోండి. నన్నేమన్నా పట్టించుకోనుగాని, ఆ గార్దభ రాజాన్ని తిడ్తే మాత్రం ఊర్కోను. గాడిదకాళ్ళు పట్టుకునే రోజు మీకూ వస్తుంది. వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్ళు పట్టుకున్నాడు. బోడి, మీ గొప్పేంటి?" అన్నాడు.

"నా గొప్పేంటో ఇల్లు ఖాళీ చేయిస్తే గానీ నీ కర్థంకాదు. ఈ పిల్లికూతలూ, కుక్కకూతలతో నా తల బొప్పి కట్టిపోతోంది. మీరు తక్షణం ఇల్లు ఖాళీ చేసేయండి" అన్నాడు కుక్కుటేశ్వరరావు రోజుకుంటూ, రొప్పుకుంటూ.

తండ్రి మారయ్య గదిలో కొచ్చినప్పటి నుండి మంగతాయారు గది బయట నిలబడి జరిగేదంతా చూస్తూనే ఉంది. తన దారికి వస్తున్న తరుణంలో మారయ్యను, వినాయకాన్ని గది ఖాళీ చేయించేస్తే మారయ్య కట్టుతప్పిపోతాడు. తన పథకం పారదు. అందుకే, లోపలికొచ్చి, "ఇంత చిన్న విషయానికి అంత పెద్ద శిక్షా నాన్నా? పిల్లిమీద బ్రహ్మాస్త్రమా? నీలాంటి పెద్ద హృదయం ఉన్న మనిషి అలా అనకూడదు" అంది తండ్రితో.

మారయ్యను 'పిల్లి' అన్నందుకూ, తనది 'పెద్ద గుండె' అన్నందుకూ కుక్కుటేశ్వర రావు చెరువులాంటి హృదయం పొంగిపోయింది.

"సరేనమ్మా, నువ్వు వద్దంటే నేను కాదనునులే. కాని ఇతని వ్యవహారం శృతిమించి రాగాన పడ్తున్నది" అన్నాడు కుక్కుటేశ్వరావు.

ఆయన అలా అనటంతో వినాయకరావు ఊపిరి పీల్చుకున్నాడు.

"ఛఛ, పెద్దలు మీరలా అనకూడదు. ముందు మీరలా కుర్చీలో కూర్చోండి. ఈ ప్రసాదం స్వీకరించండి" అంటూ వినాయకరావు మారయ్య మారీచ మహాసురుడికి కొట్టిన కొబ్బరిచిప్ప నుండి కొబ్బరి ముక్కలు తీసి తండ్రీ కూతుళ్ళిద్దరికీ ఇచ్చాడు.

అవి తింటూ, "ఆహా... మీకూ దైవభక్తి తగలడిందన్న మాట" అన్నాడాయన కుర్చీలో కూర్చుంటూ.

"అమ్మో, మామూలు భక్తా, వీరభక్తి కదండీ మా వాడిది. ప్రతి మంగళవారం మారీచ మహాసురుడికి పూజచేసి, కొబ్బరికాయ కొట్టందే మా వాడు పచ్చి మంచినీళ్ళయినా పుచ్చుకోడంటే నమ్మండి" అన్నాడు వినాయకరావు.

"అదేంటయ్యోయ్, మారీచ మహాసురుడెవరూ?"

"ఆ విగ్రహం చూడు నాన్నా! వాళ్ళ గురువుగారు తయారుచేసి ఆయన కిచ్చారంట. రామాయణంలో బంగారు లేడి అయి సీతా మహాసాధ్విని ఆకర్షించాడే ఆ మహానుభావుడే వారి ఆరాధ్య దైవం" అని వివరించింది మంగతాయారు.

మారయ్య ప్రశంసగా ఆమె వైపు చూస్తూ తన్మయంలో పడిపోయాడు.

"ఓరి, నీ యమ్మ కడుపుడకా, రాక్షసుల నటయ్యా ఆరాధించటం?" అన్నాడు కుక్కుటేశ్వరరావు ఆశ్చర్యపోతూ.

తన్నేమన్నా భరించగలడు గానీ, తన గురువును గానీ, తన ఇష్టదైవాన్ని గానీ ఎవరేమైనా అంటే సహించలేడు మారయ్య.

"అదుగో, అలాంటి అపవిత్రపు కూతలే కూయొద్దంటాను. రాముడి కంటే మారీచుడేం తక్కువ. మిమిక్రీ కళను ఈ భూప్రపంచంలోకి మొట్టమొదటిసారిగా ప్రవేశపెట్టింది ఆ మహానుభావుడే" అంటూ భక్తిభావంతో ఊగిపోతూ, "మారీచ మహాప్రభువు, 'హలో, లక్ష్మణా' అంటూ రాముడి గొంతును అనుకరిస్తూ అరిచేటప్పటికి మహాపతివ్రత అయిన సీతామహాసాధ్వి కూడా అది భర్త గొంతుకాదని గుర్తు పట్టలేకపోయింది కదా! అంత చక్కగా ఇతర్ల గొంతును అనుకరించిన మారీచ మహాసుర ప్రభువే మిమిక్రీ కళాకారులందరికీ పరదైవం, ఆ కళకు పితామహుడు" అని భక్తి తాత్పర్యాలతో ఉపన్యసించాడు మారయ్య.

"నృత్యకళని అభ్యసించే వాళ్ళు నటరాజు విగ్రహాన్ని ముందుంచుకుని నాట్యం అభ్యసించినట్లే మా వాడూ ఈ మారీచ మహాప్రభువు విగ్రహం ముందుంచుకుని తన మిమిక్రీ కళ సభ్యసిస్తుంటాడు. అక్కడికీ తెల్లవారు ఝామునే తన ప్రాక్టీసు ప్రారంభిస్తానంటాడు కానీ 'తెల్లారింతర్వాత మొదలెట్టరా, లేకపోతే చుట్టుపక్కల వాళ్ళు పీడకలలొచ్చి బాధపడ్తారు' అని నేను నచ్చజెప్పబట్టి, మా వాడు దయార్ద్ర హృదయంతో – వాడు ఇతరులు బాధపడ్తుంటే చూడలేడు లెండి – తెల్లారింతర్వాతే ప్రాక్టీసు చేస్తున్నాడు" అన్నాడు వినాయకరావు మారయ్య పిల్లి కూతలకూ, కుక్క కూతలకూ, రైలింజన్, ఏరోప్లేన్ లాంటి యంత్రాల అనుకరణకూ వివరణ ఇచ్చుకుంటూ.

"ఏవి కల్పనరా, నాయనా! అద్భుతం! మీలాంటి పాపిష్ఠి ఆలోచనలున్న వాళ్ళని ఇదే మొదటిసారి చూడటం. నా జన్మ తరించింది" అన్నాడు కుక్కుటేశ్వరరావు.

"అదిగో మళ్ళా! మావి పాపిష్ఠి ఆలోచనలా? మళ్ళీ అలాంటి మాటలంటే ఊరుకునేది లేదు కుక్కేశ్వర్రావుగారూ! మీరెంత ఇంటి ఓనరైనా నాకు లెక్కలేదు" అన్నాడు మారయ్య.

"ఊర్కోకపోతే ఉరేట్టుకో. నా ఇంట్లో ఈ అరాచకం కుదరదు."

"ఉరిపెట్టుకోవాలా? అంత మాట నన్నేనా అంది కుక్కేశ్వర్రావుగారూ?"

"ఇదిగో, ఏమయ్యోయ్. ఇందాకటి నుండి చూస్తున్నాను 'కుక్కేశ్వర్రావు కుక్కేశ్వర్రావు' అంటున్నావు. నా పేరు కుక్కుటేశ్వరరావు, కుక్కేశ్వర్రావు కాదు. మళ్ళీ కుక్కేశ్వర్రావు అన్నావా చమడా లెక్కదీస్తాను."

"పేర్లో ఏముందండీ. కుక్కుటమంటే కుక్క కాదా ఏమిటి? ఆ సంస్కృతం కంటే మన తెలుగే బావుంది. తెలుగు మీది అభిమానంతోనయినా కుక్కేశ్వర్రావు అని పేరు మార్చుకోండి" అన్నాడు మారయ్య. కుక్కుటమంటే కోడి కదా అనకండి. అతను చెప్పాక కోడి కూడా కుక్కే అవుతుంది.

కాని, కుక్కుటేశ్వరరావు తెలుగు భాష మీద అభిమానం, ప్రేమలేని మనిషి.

"టాట్ వీల్లేదు... నువ్వెవడివయ్యా నా పేరు మార్చటానికి? కుక్కుటేశ్వరస్వామి మీది భక్తితో మా అమ్మా నాయన పెట్టిన పేరు. ఇప్పుడు బొడ్డూడని కుంకవి నువ్వు చెప్పావు కాబట్టి నేను మార్చుకోవాలా? నా పేరు ఇహనుంచీ పొరపాటున కూడా తప్పుగా పిల్చావా నీ డొక్క చీరేస్తాను" అన్నాడాయన.

"అలాగే కుక్కేశ్వర్రావుగారూ..." అంటూ నాలిక్కరుచుకున్నాడు మారయ్య.

"మళ్ళీ... ఇదిగో, లే... లే, కుర్చీలో నుండి" అని పెద్దగా అరిచాడు కుక్కుటేశ్వర్రావు.

'పాపం, పిచ్చి పట్టినట్లుంది. రేబిస్ ఏమో' అనుకుంటూ బిక్కచచ్చిపోయి లేచి నించున్నాడు మారయ్య.

"చెవులు పట్టుకో రెండు చేతుల్తో."

పట్టుకున్నాడు మారయ్య.

"ఏంటి నా పేరు చెప్పు... కుక్కుటేశ్వరరావు అను."

"కుక్కుటేశ్వరరావు" చెప్పాడు మారయ్య.

"ఊఁ, కూచో... ఇప్పుడు చెప్పు, ఏంటి నా పేరు?"

"కుక్కుటేశ్వరరావు"

"మళ్ళీ లే... ఆఁ, చెప్పు ఏంటి నా పేరు?"

"కుక్కుటేశ్వరరావు."

ఇలా గుంజీలు తీయించి, తండ్రి తన పేరు మారయ్య చేత బట్టీ పట్టిస్తుంటే మంగ తాయారు మైనపు హృదయం కరిగిపోయింది.

"తప్పు నాన్నా, తప్పు! మహాకళాకారుడినలా అవమానించకూడదు మనం" అంది.

గుండె మోకాల్లోకి జారిపోయిన మారయ్య కృతజ్ఞతగా ఆమె వంక చూశాడు.

"ఏంటీ తప్పు! ఈ కుక్క కూతల మారయ్య మహాకళాకారుడా?"

"ఆయన సంగతి నీకు తెలీదు నాన్నా! మారూగారూ, ఓసారి యన్టీఆర్‌లా ఓ డైలాగు విసరండి" అంది మంగతాయారు, తండ్రికి మారయ్య ప్రతిభ కనపర్చాలనే ఆరాటంతో.

అంతే, మారయ్యలోని కళాకారుడు లేచి నుంచున్నాడు. "పాంచాలీ, పంచభర్తృకీ ..." అంటూ మయసభ సీను నటించేశాడు. యన్టీఆర్ అంత ఆజానుబాహుడు కాక, పొట్టిగా ఉన్న మారయ్య నటన వికృతంగా ఉంది. అయితే, ఆ గొంతు, ఆ మాడ్యులేషన్ అంతా యన్టీఆర్ అనుకరణే.

"ఓసారి ఎయన్నార్ స్టెప్పులేసి చూయించరా" అన్నాడు వినాయకరావు.

మారయ్య రెచ్చిపోయాడు. ఎయన్నార్, కృష్ణ, శోభన్‌బాబు, చిరంజీవి, రాజేంద్ర ప్రసాద్ లాంటి ప్రముఖ నటుల డైలాగులు వల్లిస్తూ నటించి చూపించాడు. దాంతో కుక్కుటేశ్వరరావు బుర్ర తిరిగిపోయింది. "నేనింత దాకా పిల్లికూతలూ, కుక్క కూతలూ కూసే వాడివనుకున్నా గానీ, నీలో ఇంత కళ దాగివుందని తెలియదోయ్. సారీ మారయ్యా, తెలీక నేను అవాకులూ, చెవాకులూ కూశాను. నువ్వవి మనసులో పెట్టుకోకు" అన్నాడాయన.

"అమ్మమ్మ అంత మాటనకండి... మీలాంటి పెద్దలు తిట్టినా అది ఆశీర్వాదంగా భావిస్తాడు, మా వాడు" అన్నాడు వినాయకరావు. "మీరూ మా వాడేదో అన్నాడని మనసులో పెట్టుకోకండి."

"ఛఛ. మీలాంటి యువకులు ఆవేశంలో ఏదో అనేస్తారు. నేవన్నీ మనసులో పెట్టుకుంటే నా పెద్దతనం ఏమవను? ఇంత కళ ఉన్నవాడివి ఇట్లా బూజు పట్టిపోతున్నావేమయ్యా? సినిమాల్లో ప్రయత్నించకపోయావూ? అన్నాడు కుక్కుటేశ్వరరావు.

"నేనూ అదే ప్రయత్నంలో ఉన్నానండీ" అన్నాడు మారయ్య వినయంగా.

"చూస్తుండు. నాన్నా! ఆయన కొద్ది కాలంలోనే పెద్ద స్టారయిపోతారు" అంది మంగతాయారు.

అయితే, మంగతాయారుకేం అలాంటి పిచ్చి భ్రమలు లేవు. మారయ్య హృదయాన్ని దోచుకునే ప్రయత్నమే అది. ఈ మిమిక్రీ జాడ్యాన్నీ - అందుమీదట సినిమాల్లో చేరాలన్న అతని తపనను వదిలించేస్తే అతనంత మంచి భర్త మరొకడుండడని ఆమె నిశ్చయానికొచ్చేసింది. తన ప్రతిభ పట్ల ఆమె చూపే ప్రశంసకు అతను గిరికీలు తిరిగి ఆమె ఒళ్ళో వాలిపోయాడు. సినిమా ఛాన్సులకోసం ప్రయత్నిస్తూనే మంగతాయారు ప్రేమలో గొంతు వరకూ కూరుకుపోయాడు. ఇంక ఊపిరాడక ఆమెను పెళ్ళాడేశాడు. కాని, సినిమాల ఛాన్సులు మాత్రం అతనికి విడాకు లిచ్చేశాయి.

ఇలా మిత్రరత్నం బ్రహ్మచర్య సౌశీల్యం కోల్పోయి, మంగతాయారు మెళ్ళో మూడు ముళ్ళూ వేయగానే వినాయకరావు దుఃఖభారంతో ఆ గది ఖాళీచేసి మరో గది చూసుకున్నాడు. తన్ను మరో అమ్మాయి ఎవరూ ప్రలోభంలో పడనీయకుండా బ్రహ్మచర్య వ్రతం కొనసాగిస్తున్నాడు.

పెళ్ళయి కార్యం గదిలోకి అడుగిడిన మొదటిరోజే మంగతాయారు ఆకాశంలో విహరించే మారయ్య రెక్కలు కత్తిరించేసింది.

"ఇంత కళా, గాడిద గుడ్డూ అంటూ టైం వేస్ట్ చేయకండి. గృహస్థుడికివన్నీ పనికిరావు" అంది.

"అదేం మాట భామినీ! నా కళా హృదయాన్ని అర్థం చేసుకున్న నువ్వు కూడా అలా అనడం ఏం బాగాలేదు" అన్నాడు మారయ్య ఓ ప్రఖ్యాత హీరో ఫోజుకొట్టి.

"ఇదుగో మీరలా అడ్డమైన వాళ్ళనీ అనుకరిస్తే నేను ఛస్తే భరించేది లేదు. మీరు మీరుగా ఉండండి."

మారయ్య నిర్ఘాంతపోయాడు. హీరో కృష్ణ గొంతు అనుకరించి ఏదో చెప్పబోయాడు కాని ఆమె అతన్ని వారించింది.

"మీకు సినిమా ఛాన్సులు ఎందుకు రాలేదో, రావో చెప్పేదా? మీరు వాళ్ళనీ వీళ్ళనూ అనుకరిస్తారు కాని మీ సొంత బాణీ మీకేం లేదు కనుక, సొంత గొంతు లేదు కనుక."

మారయ్య నీరుగారిపోయాడు. గొంతెత్తి ఏదో చెప్పబోయాడు కాని, అందులో నుండి ఏ నటుడు పలుకుతాడో అనే సందేహంతో ఆగిపోయాడు.

"అలా బెంబేలు పడిపోకండి. అనుకరణ మీ స్వంతం. మిమిక్రీ పెర్‌ఫార్మెన్స్‌లు ఇవ్వండి. పేరూ, డబ్బూ కూడా వస్తుంది. అంతేకానీ, మీరే నటులై పోవాలని ప్రయత్నించ కండి" అంది మంగతాయారు. అలా గిల్లీ బుజ్జగించటం ఆమెలోని కళ. ఆమె చెప్పినట్లే అప్పటి నుండీ మారయ్య సినిమా ప్రయత్నాలు మానేసి మిమిక్రీ ప్రోగ్రాములు ఇవ్వ సాగాడు. ఆమె అన్నట్లే అతనికి మిమిక్రీ ఆర్టిస్టుగా మంచి పేరొచ్చింది. అలాగే డబ్బు కూడా కూడబెట్టసాగాడు. దాంతో భార్యమీద అపరిమితమైన విశ్వాసం పెరిగిపోయింది మారయ్యకు.

ఓ రోజు బజార్లో కనపడ్డ వినాయకరావు అడిగాడు మారయ్యను. "ఒరేయ్ మారయ్యా, మరీ నల్లపూసై పోయావు. కనిపించటమే మానేశావు. నీ పిల్లి కూతలూ, కుక్క కూతలతో నేను నిద్రలేచే ఆ గోల్డెన్ ఏజ్‌ని నువ్వు మర్చిపోయావట్రా?" అని కౌగిలించేసుకున్నాడు.

"ఛూ! ఛూ! దూరంగా ఉండు. పెళ్ళాల్ని తప్ప మరెవర్నీ దగ్గరకు రానివ్వద్దని మా ఆవిడ చెప్పింది" అన్నాడు మారయ్య.

"సతీవ్రతుడై పోయావన్నమాట? నీ ఖర్మ! సినిమాలకు ప్రయత్నించటం కూడా మానేశావని విన్నాను."

"సంసారికి సినిమాలు పనికిరావని చెప్పింది మా ఆవిడ."

దాంతో వొళ్ళు మండిపోయింది వినాయకరావుకి. "ఎప్పుడూ మా ఆవిడ అది చెప్పింది, ఇది చెప్పింది అంటూ పెళ్ళాం పాట పాడటమేనా? నీకేం సొంత అభిప్రాయాలు లేవా? ఇదివరకు ఆ నటుడినీ, ఈ నటుడినీ అనుకరించే వాడివి. ఇప్పుడు పెళ్ళాన్ని అనుకరిస్తున్నావు. నిన్నింకాదేవుడు కూడా బాగుచేయలేడురా" అన్నాడు వినాయకరావు.

"కళంతా అనుకరణే అని మా ఆవిడ చెప్పింది" అంటూ వెళ్ళిపోయాడు మారయ్య. నిర్ఘాంతపడి చూస్తూండిపోయాడు వినాయకరావు. తోవనపోతూ వినాయకరావుని చూసిన కుక్కుటేశ్వరరావు భుజం వాచేలా కొట్టినప్పుడు కాని స్పృహ రాలేదు అతనికి.

"ఏమయ్యా, వినాయకం. నేనే నీ దగ్గరకు వద్దామనుకుంటున్నాను. వెదకబోయిన తీగలా నువ్వే తారసపడ్డావు. మా ఏడో అమ్మాయి చిన్నమ్మను నీకిచ్చి పెళ్ళి చేద్దామను కుంటున్నాను. అది చదువుల సరస్వతి. గాన కోకిల. వంటా వార్పూ వచ్చు. మొగుణ్ణి బాగా చూసుకునే నేర్పుంది. పైగా మా మంగతాయారు దగ్గర అన్ని పనుల్లోనూ బాగా తరిఫీదు అయింది ఏమంటావు?" అన్నాడాయన.

"వద్దు, బాబూ, వద్దు..." అని జుట్టు పీక్కుంటూ వెళ్ళిపోయాడు వినాయకరావు.

"వీడిని పిచ్చి కుక్కేమయినా కరిచిందా?" అని ఆశ్చర్యపోతూ నిలబడిపోయాడు కుక్కుటేశ్వరరావు.

*'ఆంధ్రభూమి' (ఆదివారం), 3 జనవరి 1999*

*18-12-98న ఆకాశవాణి హైదరాబాదు 'ఎ' కేంద్రం నుండి*
*రాత్రి ఎనిమిది గంటలకు ప్రసారితం.*